www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 06 | ఫిబ్రవరి | 2026
పేజీలు : 8

## అనుమతుల జారీలో నిబంధనలు పాటించాలి



-లేఔట్ అనుమతికి అప్రోచ్ రోడ్డు తప్పనిసరి
-లేఔట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్

2లో




# సాంప్రదాయ ఓటు..!

## -పెరిగిన వలస పెత్తనం

తరతరాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితమై పనిచేస్తున్న కుటుంబాలు అనేకం పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ జెండా కిందనే పనిచేసే వారు. అవకాశవాద రాజకీయాలకు తావివ్వకుండా పార్టీ నిర్ణయాన్ని శిరోధార్యంగా భావించే వారు. అటువంటి ఖచ్చితమైన సాంప్రదాయ ఓటు ఇప్పుడు కాంగ్రెస్‌కు దూరమవుతుంది. అవకాశ వాద వలస రాజకీయాలలో సనాతన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇమడలేకపోతున్నారు.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో



## నిరంతర ప్రజా సేవకులను గెలిపించండి





- సిపిఐ నేతలు బాగం, దండి
-ముమ్మరంగా సిపిఐ అభ్యర్థుల ప్రచారం

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రజా సేవకులుగా ప్రజల మధ్యలో ఉండే సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఓటర్లకు పిలుపునిచ్చారు. గురవారం ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 19, 20, 21,

మిగతా 2లో..

## కొత్తగూడెం కార్పోరేషన్‌పై ఎర్రజెండా









ప్రజాపక్షం/కొత్తగూడెం : ఈ ఎన్నికల్లో ఘనం విజయాన్ని సాధించి కొత్తగూడెం కార్పోరేషన్‌పై ఎర్రజెండా ఎగురవేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పోరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన 57 డివిజన్ అభ్యర్థి సహేరా మహ్మద్, 56 విడిజన్ అభ్యర్థి గడ్డం శాంతిప్రియ, 55 డివిజన్ అభ్యర్థి చల్లా భాస్కర్ రావు, 28వ డివిజన్ అభ్యర్థి కోలపూరి ధర్మరాజు, 29వ డివిజన్ అభ్యర్థి మాచర్ల శ్రీనివాస్, 30వ డివిజన్ అభ్యర్థి బ్యాండు దుర్గ, 52వ డివిజన్ అభ్యర్థి బానోత్ కళావతి, 53వ డివిజన్

- సిపిఐ, టిడిపి,
ప్రజా సంఘాల కూటమిని గెలిపించండి
- ఓట్ల కోసం మోసగాళ్లు వస్తున్నారు జాగ్రత్త
- పూటకో పార్టీ మారే కంత్రీల మాటలు నమ్మకండి
- కమ్యూనిస్టుల గెలుపుతో అభివృద్ధి వేగవంతం
- ఎమ్మెల్యే కూనంనేని

అభ్యర్థి బండి నర్సింహారావు, 54వ డివిజన్ అభ్యర్థి పల్లపోతు భాగ్యలక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారాన్ని

మిగతా 2లో..

# కాంగ్రెస్‌కు దూరమవుతున్న సాంప్రదాయ ఓటు..!

**ప్రజాపక్షం/ఖమ్మం :** తరతరాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితమై పనిచేస్తున్న కుటుంబాలు అనేకం పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ జెండా కిందనే పనిచేసే వారు. అవకాశవాద రాజకీయాలకు తావివ్వకుండా పార్టీ నిర్ణయాన్ని శిరోధార్యంగా భావించే వారు. అటువంటి ఖచ్చితమైన సాంప్రదాయ ఓటు ఇప్పుడు కాంగ్రెస్‌కు దూరమవుతుంది. అవకాశ వాద వలస రాజకీయాలలో సనాతన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇమడలేకపోతున్నారు. హనుమంతుని ముందు కుప్పిగంతులు వేసినట్లు అనేక అనేక సంఘటనలను చూసి ఎదుర్కొని పార్టీని నిలబెట్టే వారి ముందు వలస నేతలు పార్టీ గురించి, పార్టీ నిర్ణయాల గురించి చెబుతుంటే విస్తుపోతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఇమడలేక మరో పార్టీ మారలేక క్రమేపి క్రియాశీలక రాజకీయాలకు దూరమవుతున్నారు. 20 సంవత్సరాల కాలంలో మూడు పార్టీలు మారి ఇటీవల కాంగ్రెస్‌లో చేరి కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు కాంగ్రెస్ బీఫాం పొంది ఆ వార్డులో కాంగ్రెస్ పుట్టుక, ఎదుగుదల, బలోపేతానికి నేనే కారణం కర్త, కర్మ, క్రియ అన్ని నేనే అని చెబుతుంటే ఆ వార్డులో కేసులను, అధికార పార్టీ ఒత్తిళ్లను అధిగమించి పార్టీని నిలబెట్టిన వారు అవాక్కు అవుతున్నారు. కాంగ్రెస్‌లో ఉన్నందుకు ఇబ్బంది పెట్టినవారే ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి వీరంగం చేస్తుంటే గతంలో పడిన ఇబ్బందులను తలచుకుని ఆవేదన చెందుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వాళ్లదే పెత్తనం అయితే మనకెందుకు రాజకీయాలు అనే భావన సాంప్రదాయ కాంగ్రెస్ వాదుల్లో బలపడుతుంది. అధికారంలో లేనప్పుడు, ఏ పదవి రానప్పుడు ఇండ్లకు వచ్చి కూర్చున్న నేతలు కనీసం కన్నెత్తి చూడటం లేదన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వలసలు తెచ్చిన మార్పు...**

రాజకీయాల్లో అవకాశవాదులు ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వారు ఎక్కువయ్యారు. వివిధ మార్గాలలో డబ్బులు సంపాదించి రాజకీయాల్లోకి వచ్చిన వారు అధికారమే పరమావధిగా భావిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటుందో ఏ పార్టీకి జై కొడుతున్నారు ఏ అధికార ప్రతినిధులుగా ఉన్నారో వారి వెనక చేరి తమ అవసరాలను నెరవేర్చుకునేందుకు మొత్తం వ్యవస్థలను తప్పుదారి పట్టిస్తున్నారు. అధికారం రాగానే బెల్లం చుట్టూ ఈగల్లా ముసురుకుంటూ మరొకరికి అవకాశం ఇవ్వడం లేదు. ఇది అప్పటి బిఆర్ఎస్‌లో పనిచేసిన వారిని ఇప్పుడు అనేక దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారు అధికార యావ తప్ప మరొకటి లేని వారితో ఇబ్బంది పడుతున్నారు. అక్రమాలను సక్రమం చేసుకునేందుకు అధికార పార్టీలో చేరడం జరుగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అధికారానికి ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు ఎవరు దగ్గరగా ఉన్నారో రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనూ వారే ఇప్పుడు అధికార పీఠానికి దగ్గరగా ఉన్నారు. జెండాలు మోసిన వారు ఎప్పటిలా కార్యకర్తల్లాగానే మిగిలిపోయారు.

**శృతిమించుతున్న పెత్తనం...**

అధికార కాంగ్రెస్‌లో అసలు కంటే కొసరు పెత్తనం ఎక్కువైంది. అధికారాన్ని చెలామణి చేస్తున్న కొందరు తమ పెత్తనాన్ని కాపాడుకునేందుకు మరొకరిని దరి చేరనివ్వడం లేదు. ప్రజాప్రతినిధుల చుట్టూ చేరి అసలైన క్యాడర్‌ను, పార్టీని నమ్ముకుని ఉండేవారిని దూరం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వలస నేతల శృతిమించిన పెత్తనం కారణంగా కాంగ్రెస్‌కు నష్టం జరిగే అవకాశం ఉంది. అధికారాన్ని గుంజుకోవాలని, వాడుకోవాలని, అనుభవించాలని చూసే వారు అడ్డదారులు తొక్కుతున్నారు. రూపాయి ఖర్చు పెట్టి పది రూపాయలు గుంజే ఆలోచనల్లో ఉన్న వారితో ఏ పార్టీకైనా ప్రమాదమే. దశాబ్ద కాలంలో పలు నియోజక వర్గాల్లో నేతలు ఇటువంటి వారితో నష్టపోయినా కాంగ్రెస్ నాయకుల్లో మార్పు రాకపోవడం శోచనీయం.

# కొత్తగూడెం కార్పోరేషన్‌పై ఎర్రజెండా






**(మొదటిపేజీ తరువాయి)**

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల వ్యాప్తంగా అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, సిపిఐ, టిడిపి, ప్రజా సంఘాల కూటమిగా పోటీలో ఉన్న సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాను ఎంఎల్‌ఏగా గెలిచిన ఈ రెండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రభుత్వంతో మాట్లాడి పెద్ద ఎత్తున నిధులను తీసుకొచ్చి సమగ్రాభివృద్ధిని చేస్తామన్నారు. సిపిఐ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయడమంటే తనకు ఓట్లు వేసినట్లే అని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించినట్లుగానే ఈ కార్పోరేషన్ ఎన్నికల్లో కూడా గెలిపించాలని, తద్వారా మరింత అభివృద్ధి చేసుకునేందుకు వీలుంటుందన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై ఉండే సిపిఐకి ప్రజా సమస్యలపై ఎక్కువ అవగాహన ఉంటుందని, అలాంటిది మన అభ్యర్థులే కార్పోరేటర్లుగా ఉండటం ద్వారా ప్రజలకే మేలు చేకూరుతుందని, కంకి కొడవలి గుర్తుకు ఓట్లు వేసి సిపిఐ,టిడిపి,ప్రజా సంఘాల కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల సమయంలో పూటకో పార్టీ మారుతూ, నిమిషానికో కండువా కప్పుకునే కంత్రీగాళ్లు మీ వద్దకు వస్తుంటారని, కళ్లబొల్లి మాటలు చెప్పిన ఓట్లు దండుకుని ముఖం చాటేస్తారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ప్రలోబాలకు లొంగకుండా మంచివారైన సిపిఐ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఎంఎల్ఏది ఏముందిలే, సిపిఐకి ఏముందులే అంటూ కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, తామేప్పుడూ ఎవ్వర్నీ విమర్శించలేదని హితవు పలికారు. కాంగ్రెస్‌తో సీట్ల సంఖ్య సర్దుబాటు కాని కారణంగా సిపిఐ కూటమి 60డివిజన్ల వ్యాప్తంగా పోటీలో ఉందని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు, అభిష్టాల మేరకు ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

**అనూహ్య స్పందన...**

డివిజన్ల వ్యాప్తంగా సిపిఐ,టిడిపి, ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తోంది. కూనంనేని ప్రచార రథానికి చుట్టూ పెద్ద ఎత్తున ప్రజల గుమిగూడుతూ సిపిఐ జిందాబాద్, ఎన్నికల గుర్తు కంకికొడవలికే మా ఓటు అంటూ నినాదాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయన వద్దకు వచ్చిన పలు విషయాలను చర్చిస్తూ తామంతా పాత కాంమ్రెడ్ల కుటుంబీకులమే అంటూ చెబుతూ మీకే ఓటు వేస్తామని మాటిస్తున్నారు. ఈ ప్రాంతాలన్నీ అప్పట్లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఇచ్చిన కాలనీలే అని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో కూనంనేని మరింత ఉత్సాహంతో ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ప్రజానాట్యమండలి కళాకారుల డప్పువాయిద్యాలు, స్టెప్పులు ప్రచారానికి చైతన్యాన్ని ఇస్తున్నాయి. ఈ ప్రచార కార్యక్రమాల్లో కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, దుర్గరాశి వెంకన్న, చలిగంటి శ్రీనివాస్, వై ఉదయ్ భాస్కర్, భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, కందుల భాస్కర్, గెద్దాడు నగేష్, నెరేళ్ల రమేష్, మునిగడప వెంకటేశ్వర్లు, మునిగడప పద్మ, వంగా వెంకట్, రమణమూర్తి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతుల జారీలో నిబంధనలు పాటించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ ప్రజ్ఞా సమావేశ మందిరంలో జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న లేఔట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12 డ్రాఫ్ట్ లేఔట్, నాలుగు ఫైనల్ లేఔట్‌లను కమిటీ పరిశీలించిందన్నారు. లేఔట్ అనుమతులు మంజూరు చేసే సమయంలో తప్పనిసరిగా ఎటువంటి వాటర్ బాడీ ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలోకి రాకుండా జాగ్రత్త పడాలన్నారు. లేఔట్‌లో అప్రోచ్ రోడ్డు 18 మీటర్లు ఉండాలన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లేఔట్‌లో కేటాయింపు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. లేఔట్ ప్రాంతం, నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లలో అనుమతులు జారీ చేయడం కుదరదన్నారు. ఎడి సర్వే‌ల్యాండ్ రికార్డ్స్, మండల సర్వేయర్లు, ఆర్డివోలు సంయుక్తంగా లేఔట్ దరఖాస్తును చుట్టు పక్కల సర్వే నెంబర్లను పరిశీలించి రిపోర్టు అందించాలన్నారు. లేఔట్ ఆమోదప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని మనం జారీ చేసిన అనుమతుల నిబంధనలను అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారో లేదో పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఎస్‌డిసిఎం రాజేశ్వరి, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకోబ్, పిఆర్ఎస్‌సి వెంకటరెడ్డి, ఎన్‌పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారి, డిటిసిపి అధికారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రాజేందర్, ఏదులాపురం టౌన్ ప్లానింగ్ అధికారి, ఈఈ ఇరిగేషన్ శ్రీనివాసరెడ్డి, డిఈ కె. రాజేష్, తహసీల్దార్లు రాంప్రసాద్, సైదులు, శ్వేత, అరుణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిరంతర ప్రజా సేవకులను గెలిపించండి

**(మొదటిపేజీ తరువాయి)**

29, 30, 31, 32 డివిజన్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రజెండాల రెపరెపల నడుమ అభ్యర్థులతో కలిసి గడగడపకు వెళ్లి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ... కమ్యూనిస్టులు ఏ రోజు అధికారం కోసం వెంపర్లాడలేదని, కేవలం పేద ప్రజల పక్షానే అండగా నిలచినట్లు పేర్కొన్నారు. బూర్జ్వ పార్టీలు అధికారం చేజిక్కించుకొని, ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంభిస్తుంటే అడ్డుకున్నామన్నారు. ఎదిరించేవాడు లేకుంటే బెదిరించే వారిదే రాజ్యం అన్న రీతికి కమ్యూనిస్టులు కళ్లెం వేశారన్నారు. ఇలా అధికారపక్ష ఆగడాలను ప్రశ్నిస్తూ కొరకని కొయ్యగా ఎర్రజెండా ప్రజా గొంతుకయ్యిందన్నారు. బ్యాంకులు జాతీయ చేయడంతో పాటు అనేక హక్కులను తీసుకువచ్చిన పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందన్నారు. అధికారం లేకున్నా ప్రభుత్వాలను ప్రశ్నించి, అభివృద్ధిలో ప్రాంతాలను అగ్రగామిలో ఉంచినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వాల నుంచి రావాల్సిన పథకాలను ప్రజలకు చేరవేయడంలో కమ్యూనిస్టులుగా కీలకంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాలు, తాడిత, పీడిత ప్రజల ఆపద్బాంధవు కమ్యూనిస్టు పార్టీలేనన్నారు. కావున కంకి,కొడవలి గుర్తుపై ఓటేసి ప్రశ్నించే గొంతుకలను ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, అజ్మీరా రామ్మూర్తి, ప్రజాపక్షం బ్యూరో ఇంచార్జ్ ఏనుగు వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ బిజీ క్లైమేట్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బానోత్ రాంకోటీ, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, ఐఏఎల్ జాతీయ సమితి సభ్యుడు ఓరుగంటి శేషగిరి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మున్సిపాలిటీ నాయకులు, వార్డుల సిపిఐ కార్యదర్శులు, యువజన సంఘం సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో పోటాపోటీ ప్రచారం

**-ఎమ్మెల్యే రాగమయి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా ప్రచారం**

**-మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వన్ మ్యాన్ షో**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మున్సిపాలిటీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సత్తుపల్లి పట్టణం మొత్తం రాజకీయ సందడితో మార్మోగుతోంది. 23 వార్డులలో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఆయా పార్టీల నాయకులు గల్లీ గల్లీ తిరుగుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. డప్పుల సౌండ్, టపాసుల మోతతో పట్టణం పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. అధికార పార్టీ తరఫున ఎమ్మెల్యే రాగమయి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు, సన్నవడ్లకు బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఒంటరిగా ప్రచార బాధ్యతలు భుజాన వేసుకుని వన్ మ్యాన్ షో కొనసాగిస్తున్నారు. త మ ప్రభుత్వ హయాంలోనే నూతన మున్సిపల్ కార్యాలయం 100 పడకల ఆసుపత్రి క్రిస్టియన్ భవనం, ధోబీ ఘాట్, షాదీఖానా అంబేద్కర్ ఆడిటోరియం ఎన్టీఆర్ కాంస్య విగ్రహం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం 100 అడుగుల జాతీయ జెండా, అశోక చక్రం ప్రతి వీధిలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లువంటి అభివృద్ధి పనులు పూర్తి చేశామని గుర్తు చేస్తూ, తమ అభ్యర్థులను గెలిపిస్తే మరింత పురోగతి సాధిస్తామని ఓటర్లను కోరుతున్నారు. ఇరు పార్టీల నాయకుల ఉత్కంఠభరిత ప్రచారంతో సత్తుపల్లి పట్టణం మొత్తం రాజకీయ హోరాహోరీకి వేదిక గా మారింది. ఎవరి బలం ఎంత అన్నది తేలేది మాత్రం పోలింగ్ రోజే అన్న చర్చ సర్వత్రా వినిపిస్తోంది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు మెరుగుపర్చాలి

**-రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలి**
**-ఎఫ్ఆర్ఎస్ విధానంలో సిబ్బంది హాజరు**
**-సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జనరల్ ఆసుపత్రిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరిచి రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజ్ఞా సమావేశ మందిరంలో గురువారం ఖమ్మం జనరల్ ఆసుపత్రి పనితీరు, ఆసుపత్రిలో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగ్రస్త్య లతో కలిసి వైద్యాధికారులు, మున్సిపల్ మిషన్ భగీరథ, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖమ్మం ఆసుపత్రిలో వసతులు మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ఈ పద్దతిలో వెంటనే మార్పులు రావాలన్నారు. రెండు వారాలకు ఒకసారి ఆసుపత్రి పనితీరుపై ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ రివ్యూ నిర్వహించాలన్నారు. ఆసుపత్రిలోని 10 స్పెషల్ రూమ్ మరమ్మత్తు పనులు మున్సిపల్ కార్పోరేషన్ ద్వారా చేపట్టి 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఎమర్జెన్సీ సమయంలో వినియోగించేందుకు జిజిహెచ్ వద్ద ఐదు లక్షల రూపాయలు నిరంతరం అందుబాటులో ఉంచుతామని ఏ విభాగంలోనైనా వైద్య పరికరాలు, యంత్రాలు అవసరం ఉంటే వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ఆసుపత్రిలో రూ. 1.65 కోట్లతో చేపట్టిన మరుగుదొడ్లను నెల రోజుల్లో పూర్తి చేసి వాటి నిర్వహణకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో ఆర్ఎంవోలను నియమించి పాలన వ్యవహారాలు వారికి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. ఎంసిహెచ్‌లోని సివరేజ్ లైన్స్, టాయిలెట్స్ పనులు ఈనెలాఖరు కల్లా పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రి ముందు ఉన్న ఖాళీ స్థలంలో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నారు. ఓపి రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక బ్లాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను తాత్కాలిక ప్రతిపాదికన నియమించాలని తెలిపారు. లిఫ్ట్ మరమ్మతులు పూర్తి కాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజుల్లో లిఫ్ట్ పనులు పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రి అవసరాల కోసం ప్రస్తుత వాటర్ సంప్ సరిపోవడం లేదని మరో 200 కెవిఎల్ సామర్థ్యంతో కూడిన సంప్ నిర్మించాలన్నారు. ఆసుపత్రి భవనం నుండి ఎక్కడ వాటర్ లీకేజీ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో అవసరమైన ఫైర్ సేఫ్టీ పనులు, సిసి కెమెరాల ఏర్పాటు మార్చి 15 నాటికి పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రి వద్ద రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అవసరమైన భద్రత ఏర్పాట్లు ఉండాలన్నారు. నెలకు రూ. 55 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆసుపత్రిలో ఆశించిన స్థాయిలో పారిశుధ్యం ఉండడం లేదని కలెక్టర్ తెలిపారు. పారిశుధ్య పనితీరు సరిగ్గా లేదంటూ సంబంధిత ఏజెన్సీలకు నోటీసులు జారీ చేయాలని, పారిశుధ్యం మెరుగు కానీ పక్షంలో ఏజెన్సీని రద్దు చేయాలని డిఎంఈకి లేఖ రాయాలన్నారు. ఆసుపత్రిలో ఎఫ్ఆర్ఎస్ విధానంలో పారిశుధ్య సిబ్బంది హాజరు నమోదయ్యేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. దాని ఆధారంగా జీతాలు చెల్లించాలన్నారు. బయో మెడికల్ వేస్ట్, డిస్పోజల్ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జనరల్ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య తగ్గుతుందని, హైరిస్క్ కేసులను గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేసిన తర్వాత ఆ కేసులను ఫాలోఅప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, వైద్యశాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, వివిధ విభాగాల వైద్యాధికారులు, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలను దృష్టిలో పెట్టుకుని మధిర అభివృద్ధి

**- విలేకరుల సమావేశంలో కొండబాల, రాయల, వాసిరెడ్డి**



**ప్రజాపక్షం/ మధిర :** భావితరాలను దృష్టిలో పెట్టుకుని మధిర పట్టణాన్ని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషి చేస్తున్నారని మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తెలిపారు. గురువారం మధిరలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మధిర చరిత్రను ఈ ప్రాంత విశిష్టతను భావితరాలకు అందించడంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి తొలిసారి 2009లో శాసనసభ్యులుగా ఎన్నికైన ప్రస్తుత డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని అన్నారు. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న మధిరను పట్టణీకరణ దిశగా అడుగులు వేయించేందుకు నగర పంచాయతీగా మార్పు చేసి ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. ఆతర్వాత పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి నామమాత్రమే అని అన్నారు. మధిర అభివృద్ధే లక్ష్యంగా సుదీర్ఘమైన ప్రణాళిక కలిగిన భట్టి విక్రమార్క డిప్యూటీ సిఎం బాధ్యతలు స్వీకరించిన తర్వాత మధిరలో అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే సుమారు రూ.600 కోట్ల నిధులతో భూమి పూజలు చేయడం జరిగిందని అన్నారు. మధిర పట్టణాన్ని మోడల్ నియోజకవర్గ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు భవిష్యత్‌లో మరిన్ని నిధులు మంజూరుకు కృషి జరుగుతుందన్నారు. అలాగే మధిర అభివృద్ధికి సంబంధించి కూడా అఖిలపక్ష రాజకీయ పార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో సూచనలను సలహాలు సేకరించి ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కేటాయింపుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశం పార్టీ కలిసి పోటీ చేస్తున్నాయని, ఈ కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజలు మధిర అభివృద్ధికి మద్దతుగా నిలవాలని వారు కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మిర్యాల రమణగుప్తా, సూరంశెట్టి కిషోర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) ఖమ్మం జిల్లా నాయకులు కే పుల్లారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం మండాలపాడులో టీయుసిఐ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగాపుల్లారావు మాట్లాడుతూ భారతదేశంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ చేస్తూ, నాలుగు లేబర్ కోడులుగా విభజించి ఏప్రిల్ ఫస్ట్ తారీకు నుంచి అమలు చేయబోతుందని, ఈ కార్మిక చట్టాల సవరణ కార్పొరేట్లకు అనుకూలంగా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉన్నాయని, కార్మికుల శ్రమను కార్పొరేట్లకు, బడా కంపెనీలకు దోచిపెట్టే విధంగా ఉన్నాయని వెంటనే ఈ నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని అన్ని ట్రేడ్ యూనియన్లు పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12న జరగబోయే దేశవ్యాప్త సమ్మె లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా హమాలి సంఘం నాయకులు రామినేని సీతన్న, మండల నాయకులు రామినేని వెంకటేశ్వర్లరావు, వడ్డీగ యాలాద్రి, రేగళ్ల నారాయణ, జంగా బసవయ్య, గంగుల నాగేశ్వరరావు, కత్తిరాజు, శీలం రమేష్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు బాసటగా పెన్షనర్లు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని ఏఐ జాక్టో ఆధ్వర్యంలో వేలాది మంది ఉపాధ్యాయులు ఢిల్లీ బాట పట్టారు. వారికి బాసటగా ఎస్‌జిపిఏటి ఆధ్వర్యంలో పెన్షనర్లు గురువారం అంబేద్కర్ సెంటర్‌లో సంఘీభావం తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయాలని, ఎన్ఈపి 2020ను ఉపసంహరించాలని, పాఠశాలల రద్దు లేదా కలపటాన్ని ఆపాలని, ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిపిఏటి ఖమ్మంజిల్లా శాఖ అధ్యక్షులు పరిశ పుల్లయ్య, కార్యదర్శి రాయల రవికుమార్, సంఘం బాధ్యులు కృష్ణకుమారి, తాడి అంజలి, బెల్లం రాధాకృష్ణ, నాగప్రసాద్, సుధాకర్, హుస్సేన్, నారాయణ, వెంకటనర్సయ్య, వెంకటేశ్వర్లు, అంజన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల్లో ప్రమాద ప్రదేశాల గుర్తింపు ఎలా...?

**-లోక్‌సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ రహదారులు , ఎక్స్‌ప్రెస్‌వేల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వాటి గుర్తింపు నివారణ చర్యలపై ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి పార్లమెంట్‌లో గురువారం ప్రశ్నించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను ఏ ప్రమాణాలతో గుర్తిస్తున్నారని, వాటిపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని ఆయన ప్రశ్నించారు. దీనికి జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. జాతీయ రహదారులు ఎక్స్‌ప్రెస్ వేల్లో ప్రమాద ప్రదేశాల గుర్తింపును రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే నివేదికల ఆధారంగా చేపడుతున్నట్లు తెలిపారు. మరణాలు, తీవ్ర గాయాలకు దారితీసే నిర్దిష్ట సంఖ్యలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను ప్రమాద బ్లాక్ స్పాట్‌లుగా గుర్తిస్తున్నామని స్పష్టం చేశారు. సమాచారాన్ని సమగ్రంగా సేకరించి విశ్లేషించేందుకు ఎలక్ట్రానిక్ డిటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈడిఏఆర్) వ్యవస్థను అమల్లోకి తీసుకు వచ్చినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ వ్యవస్థ ద్వారా దేశ వ్యాప్తంగా ప్రమాదాల డేటాను ఒకే వేదికపై సేకరించి విశ్లేషించడం సాధ్యమవుతుందన్నారు. దీని ఆధారంగా ప్రమాద ప్రదేశాల గుర్తింపు, నివారణ చర్యల అమలు, తీసుకున్న చర్యల పర్యవేక్షణతో పాటు ప్రమాదాలకు సంబంధించిన బీమా క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి వివరించారు.

# కల్లంలోని మిర్చి దొంగతనం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కల్లంలో ఆరబోసిన మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు గంగిరెడ్డి విజయ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... విజయ్‌రెడ్డి కోటపాడు సమీపంలో నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి పంటను సాగు చేస్తున్నాడు. కూలీలతో ఇటీవల మిరపకాయలను ఏరించి కోటపాడు వద్ద గల మామిడితోట సమీపంలో కల్లంలో ఆరబోశాడు. గురువారం ఉదయం విజయ్ రెడ్డి కల్లం వద్దకు వెళ్లి చూడగా ఆరబోసిన మిర్చిలో ఓ పక్కన మిరపకాయలన్నీ చెల్లాచెదురై ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు రైతు విజయ్‌రెడ్డి తెలిపారు. సుమారు మూడు క్వింటాళ్ల మిరపకాయలను దొంగిలించారన్నారు. గతంలో కోటపాడు సర్పంచ్ తండ్రి అయిన కొంటిముక్కుల శ్రీనివాసరావు మిర్చి తోటలో కూడా గుర్తు తెలియని వ్యక్తులు కలుపు మందు కొట్టి నాశనం చేశారని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

# నల్లబ్యాడ్జీలతో నిరసన



**ప్రజాపక్షం/ మధిర :** చేవెళ్ల బార్ అసోసియేషన్‌కు చెందిన యువ న్యాయవాది స్వప్నను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటనను ఖండిస్తూ మధిర బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.పుల్లారావు మాట్లాడుతూ న్యాయ వృత్తిపై, న్యాయపాలనపై దాడులు జరగటం అమానుషమని, ఈ ఘటన తీవ్రమైన ఆందోళన కలిగిస్తోందని అన్నారు. న్యాయవాదుల భద్రత, గౌరవం, వృత్తి స్వేచ్ఛను కాపాడేందుకు ప్రతిఒక్కరూ ఎలాంటి సంఘటనలను ఖండించాలని, న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఇకపై సహించబోమని, హత్యకు గురైన స్వప్న కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, దిరిశాల జగన్మోహన్‌రావు, కట్టా పూర్ణచంద్రరావు, నంబూరు జనార్ధన్‌రావు, కాపూరి రమేష్, టి.వెంకట్రావు ఎం.సతీష్, జింకల రమేష్, టి.వెంకట్రావు, రమణ, కోట రమేష్, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం నుంచి కోటేశ్వరరావు బహిష్కరణ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్టీ నిర్ణయాలను, క్రమశిక్షణను ఉల్లంఘించి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న తమ్మినేని కోటేశ్వరరావును పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు సిపిఎం రూరల్ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీకి సంబంధం లేకుండా కోటేశ్వరరావు చేసిన చర్యలు పార్టీకి తీవ్ర నష్టం కలిగించాయని పలుమార్లు అంతర్గతంగా చర్యలు తీసుకున్నా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక కాంగ్రెస్ నేతలతో కుమ్మక్కై పార్టీ నిర్ణయానికి భిన్నంగా కాంగ్రెస్ అభ్యర్థి ఏకగ్రీవానికి సహకరించాడని మరో ఇద్దరిని ఉపసంహరింపజేయడానికి ప్రయత్నించాడని సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

## పెన్షనర్ బకాయిలను చెల్లించాలి

**-పిఆర్‌పిఏ జిల్లా కన్వీనర్ వైవి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల బకాయిలను ఏక మొత్తంలో చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ (పిఆర్‌పిఏ) ఖమ్మం జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పిఆర్‌టియు భవనంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వైవి మాట్లాడుతూ గ్రాట్యూటి, కమిటేషన్, జిపిఎఫ్, జిఐఎస్ బకాయిలు రెండేళ్లు కావస్తున్న చెల్లించకపోవడం వల్ల సుమారు 35 మందికి పైగా పెన్షనర్లు చనిపోయారని ఆయన తెలిపారు. తీవ్ర అనారోగ్యాలకు గురై వైద్య చికిత్సలకు డబ్బులు లేక పిల్లల పెళ్లిళ్లు చేయలేక పెన్షనర్లు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం రోటరీనగర్, బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్న పెన్షనర్ల ఇంటికి వెళ్లి పిఆర్‌పిఏ మెంబర్‌షిప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మాజీ అధ్యక్షులు చలపతిరావు, కొత్తా శ్రీనివాసరావు, ఎం. దామోదర్‌రెడ్డి, హమీద్, ఎం. సీతారామయ్య, మల్లవరపు కాంతారావు, దండ గురవయ్య, వి. జగన్‌మోహన్‌రావు, కొత్తపల్లి గురు ప్రసాద్, వెల్లంకి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ గాజుల కృష్ణారావు ప్రారంభించారు. గురువారం ఉపాధి నిధులు రూ. 8లక్షలతో చేపట్టనున్న డొంక రోడ్ల అభివృద్ధి పనులను సర్పంచ్ గాజుల కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేసి రోజువారి వేతనం పొందాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఉపాధి నిధులతో డొంక రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ ప్రశాంత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల అరెస్టు సరికాదు

**-ఎస్‌జిపిఏటి ఖమ్మం జిల్లా శాఖ డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు తమ సమస్యలను గవర్నర్‌కు నివేదించేందుకు ప్రయత్నిస్తే వారిని అరెస్టు చేయడం సరి కాదని తక్షణమే అరెస్టు చేసిన పెన్షనర్లను బేషరతుగా విడుదల చేయాలని ఎస్‌జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్చి 2024 నుంచి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం ప్రాతినిధ్యాలు, నిరహర దీక్షలు, ధర్నాలు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. వెంటనే పెన్షనర్ల బకాయిల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్‌జిపిఏటి ఆధ్వర్యంలో పెన్షనర్లతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ లు తెలిపారు.

## నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు అమలు

**-ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ శ్రీనివాస్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 2025 నవంబర్ 21 నుంచి నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు అమల్లోకి వచ్చాయని ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ వైడి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను ఏకీకృతం చేసి నాలుగు సమగ్ర కార్మిక కోడ్‌లను అమల్లోకి తీసుకు వచ్చిందన్నారు. వేతనాల కోడ్ 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, సామాజిక భద్రత కోడ్ 2020, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని ప్రదేశ పరిస్థితుల కోడ్ 2020 లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త లేబర్ కోడ్స్ ప్రకారం ఈపిఎఫ్ వేతనాల నిర్వచనం ఏకరీతిగా అమల్లోకి వచ్చిందన్నారు. వేతనాలు అంటే బేసిక్ పే, డియర్నెస్ అలవెన్స్ (డిఏ), రిటైనింగ్ అలవెన్స్ కలిపి తీసుకోవాలని, హౌజ్ రెంట్ అలవెన్స్, బోనస్ ఓవరైమ్ అలవెన్స్, కన్వేయన్స్ అలవెన్స్, కమిషన్ ఇతర సౌకర్యాల విలువలను వేతనాల నుండి మినహాయించాలని తెలిపారు. ఈ మినహాయింపులు మొత్తం వేతనంలో 50 శాతం కంటే ఎక్కువైతే అదనపు భాగాన్ని తిరిగి వేతనాల నిర్వచనంలో కలపాలన్నారు. నూతన విధానం వల్ల ఈపిఎఫ్ కాంట్రిబ్యూషన్ బేస్ పెరుగుతుందని, ఉద్యోగులకు పిఎఫ్, డిడక్షన్ ఎక్కువైనా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెరుగుతాయని, యజమానులకు కాంప్లయిన్స్ స్పష్టత వస్తుందన్నారు. ఈ కార్మిక కోడ్‌లు ఆత్మ నిర్భార్ భారత్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని, ఈ కోడ్‌ల క్రింద లభించే ప్రయోజనాలను వినియోగించుకోవాలని యజమానులకు, ఉద్యోగులకు సూచించారు.

# ఏదులాపురం బరిలో యువ 'మందారం'

**-హారతి పట్టి స్వాగతిస్తున్న ఓటర్లు**
**-ప్రజాక్షేత్రంలోకి ఉన్నత విద్యావంతురాలు**







**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఏదులాపురం గ్రామానికి పోరాట పటిమను నేర్పిన ఘనత బాబాయ్ దండి భాస్కర్‌ది. కక్షలు, కార్పణ్యాలతో అట్టుడికిన గ్రామాన్ని ప్రశాంత గ్రామంగా తీర్చిదిద్దిన ఘనత తండ్రి దండి సురేష్‌ది. ఆ పోరాటాలకు అండగా నిలిచి ఎర్రజెండా రెపరెపలకు అడ్డాగా నిలిపిన త్యాగ చరిత ఈ ప్రాంత ప్రజలది. కమ్యూనిస్టు పార్టీకి పెట్టని కోటగా నిలిచిన ఏదులాపురంలో యువ మందారం ఇప్పుడు వికసిస్తుంది. పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని కంకి కొడవలి గుర్తుకు ఓటేయండి అంటూ ఎన్నికల రణక్షేత్రంలోకి దిగింది. సమన్వయంలో తండ్రిని, దూకుడుగా వ్యవహరించడంలో బాబాయ్ భాస్కర్‌ను ఓటర్లకు గుర్తు చేస్తూ ప్రచారంలో దూసుకుపోతున్న యువ అభ్యర్థి దండి శ్రీజ ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా వార్తల్లో వ్యక్తిగా నిలిచింది. సాంప్రదాయ కమ్యూనిస్టు పార్టీ కుటుంబంలో జన్మించిన శ్రీజ న్యాయవాద వృత్తిని అభ్యసించింది. తండ్రి సిపిఐ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తుండగా శ్రీజ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. రెడ్‌షర్ట్ వాలంటీర్‌గా, జనసేవాదళ్ కార్యకర్తగా పనిచేయడమే గాక నిరంతరం ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించేది. ఈ నెల 11న జరగనున్న ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల్లో శ్రీజ కమ్యూనిస్టు పార్టీ పక్షాన 30వ డివిజన్ అభ్యర్థిగా నిలిచింది. తాత దండి రామయ్య మొదలు ఇప్పటి వరకు ఆ కుటుంబం కమ్యూనిస్టు పార్టీకి అంకితమై పని చేసింది. ఆ కుటుంబం నుంచి వచ్చిన శ్రీజ ఇప్పుడు పార్టీ కార్యకర్తల అండతో ప్రచారంలో దూసుకుపోతుంది. శ్రీజ అభ్యర్థిత్వం ప్రత్యర్థులకు ఓటమిని ముందే చూపించగా పార్టీ క్యాడర్‌కు కొత్త సత్తువను ఇచ్చింది. దండి సురేష్ కుటుంబానికి ఉన్న నిబద్ధత, ప్రజలతో ఉన్న సత్సంబంధాలు శ్రీజకు అదనపు బలాన్ని ఇచ్చాయి.

**ప్రచారంలో విశేష ప్రజాదరణ :**
దండి శ్రీజ ప్రచారానికి విశేష ఆదరణ లభిస్తుంది. ఎదురెగి హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్నారు. వందలాది మంది పార్టీ క్యాడర్ వెంటరాగా శ్రీజ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కమ్యూనిస్టు పార్టీ చేసిన సేవలను ఇంటింటితో గల సత్సంబంధాలను గుర్తు చేస్తున్నారు. చాలా కుటుంబాలు తలలో నాలుకలా నిలిచిన దండి భాస్కర్‌ను గుర్తు చేసుకుంటూ కంటతడి పెడుతున్నారు. అనేక దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీకి పెట్టని కోటలా ఉన్న ఏదులాపురం 30వ డివిజన్‌పై మరోసారి అరుణ పతాకం రెపరెపలాడనుందని ఓటర్లు చర్చించుకుంటున్నారు. యుక్త వయస్సులో కమ్యూనిస్టు పార్టీ రాజకీయాల్లో కొనసాగుతూ ప్రచారంలో దూసుకుపోతున్న శ్రీజ ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**అభివృద్ధికి మోడల్‌గా నిలుపుతా :**
30వ డివిజన్‌ను ఏదులాపురం మున్సిపాలిటీలో అభివృద్ధికి మోడల్‌గా నిలుపుతానని ప్రజలు కంకి కొడవలి గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శ్రీజ కోరారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మీ ఇంట్లో అమ్మాయిగా సేవ చేస్తానని ఆదరించి గెలిపించాలని ఆమె ఇంటింటికి తిరిగి విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ ప్రాంతంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సేవలు అందించిన కుటుంబం వారసురాలిగా ఆశీర్వదించాలని డివిజన్‌ను అభివృద్ధి పదంలో నడిపిస్తానని శ్రీజ తెలిపారు.

# సత్తుపల్లి మున్సిపాలిటీ దక్కేదెవరికో..!

**-కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య హోరాహోరీ**
**-చైర్మన్ పీఠం కోసం కదలిన కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యే, టిజిఐడిసి చైర్మన్**
**-ఒంటరి పోరాటం చేస్తున్న కారు పార్టీ నాయకుడు సండ్ర**
**-గెలుపుపై ఎవరి అంచనాలు వారివే**
**-పార్టీ మారిన వారంతా మనవాళ్ళేనా..?**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాజకీయాల్లో ఎప్పుడూ హాట్‌స్పాట్‌గా ఉండే సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికలు ఈసారి మరింత ఉత్కంఠ భరితంగా మారాయి. అధికార, ప్రతిపక్ష శక్తులు అన్నీ తమ ప్రతిష్ఠను ఇక్కడే పరీక్షించుకుంటుండటంతో ఇది కేవలం స్థానిక ఎన్నికగా కాకుండా రాష్ట్ర స్థాయి రాజకీయ యుద్ధంగా మారింది. మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరులా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి మున్సిపల్ స్థాయిలో తన బలాన్ని నిరూపించుకోవాలని చూస్తుండగా, బిఆర్ఎస్ మాత్రం స్థానిక పాలనలో మా బలమే గొప్పది అని చాటుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. రెండు పార్టీల లీడర్లు మున్సిపాలిటీలోని 23 వార్డులలోని గతంలో చూడని గల్లీలను చూస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. అంతేకాకుండా అభివృద్ధి వాగ్దానాలతో ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డాయి ఇరు పార్టీలు. అదే విధంగా ఈ పోటీలో కీలక మలుపు తిప్పే అంశం ఏమిటంటే సిపిఐ పార్టీ అభ్యర్థులు నిలిచిన 11,14 వార్డులతో పాటు, భారతీయ జనతా పార్టీ పోటీలో ఉన్న 22 వార్డులలో ఓటు చీలి ఇరు పార్టీలకు ఎదురుదెబ్బ తగిలేలా కనిపిస్తుంది. ఈ రెండు పార్టీలకు గెలుపు అవకాశాలు పరిమితమైనా, కొన్ని వార్డుల్లో వీరి ఓట్లు ఎవరి పాలిట పడతాయన్నదే ఫలితాన్ని నిర్ణయించే అంశంగా మారింది. ముఖ్యంగా సంప్రదాయంగా కాంగ్రెస్ లేదా బిఆర్ఎస్‌కు వచ్చే ఓట్లు చీలితే గెలుపు సమీకరణలు తలకిందులయ్యే పరిస్థితి నెలకొంది.

**చైర్మన్ పీఠం కోసం పెద్దల ఎంట్రీ..**
సత్తుపల్లి ప్రాధాన్యం ఎంత పెరిగిందంటే చైర్మన్ పదవిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే, టీజీఐడీసీ చైర్మన్ స్థాయి నాయకులు కూడా రంగంలోకి దిగారంటే చైర్మన్ పీఠం ఇరు పార్టీలకు ఎంత కీలకమో అర్థమవుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఒంటరి పోరాటంలో సండ్రబిఆర్ఎస్ తరపున సండ్ర నాయకత్వం ఈసారి ప్రత్యేక ఆకర్షణగా మారింది. పార్టీ మార్పులు, అంతర్గత విభేదాల మధ్య కూడా ఆయన "కారు పార్టీ" బలాన్ని ఒంటరిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అభివృద్ధి పనుల రికార్డు, పాత నెట్‌వర్క్ ఆయనకు బలం కాగా, కొత్త రాజకీయ సమీకరణలు సవాల్‌గా మారాయి.

**పార్టీ మారిన వారంతా మనవాళ్లేనా..?**
ఈ ఎన్నికల్లో మరో కీలక అంశం ఏమిటంటే పార్టీలు మారిన నేతల ప్రభావం. కాంగ్రెస్‌లోకి వెళ్లినవారు నిజంగా ఓటర్లను తమవైపు తిప్పగలరాలేదా బిఆర్ఎస్ పట్ల ఉన్న సంప్రదాయ విశ్వాసమే చివరికి గెలుపునిస్తుందా అనేది పలు ప్రశ్నలకు దారి తీస్తుంది. ఇదే ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించే సైలెంట్ ఫ్యాక్టర్‌గా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. నిన్నటి వరకు కారులో సికారు చేసిన చోటా నాయకులు నేడు ఒక్కసారిగా చెయ్యి పట్టుకున్నారు. వీరి వల్లన అధికార పార్టీకి లాభం కంటే నష్టమే ఎక్కువ అనేది ఓటర్ల నుండి వినిపిస్తున్న మాట. చెయ్యందుకున్న వారంతా వారి జంపింగ్ జపాంగ్ లేనని, ఏ రోజు ఏ పార్టీలో ఉంటారో తెలియని ఇటువంటి వారితో పార్టీలకు నష్టం తప్ప లాభం ఉండకపోగా వారి వల్లన నిఖార్సయిన ఓటర్లు సైతం దూరమవుతారన్నది ఆయా పార్టీలలోని నాయకుల నుండి వస్తున్న మాట. ఇప్పటికి రెండు బలమైన పార్టీలకు చెరి సగం సీట్లు వస్తాయని సర్వేలు చెబుతున్నాయి.

# ప్రచారంలో సిపిఐ అభ్యర్థుల ముందంజ

**- ఎంఎల్ఏ కూనంనేని పట్ల ప్రజల్లో సానుకూలత**
**- కంకీ కొడవలి గుర్తుపై ఓటేసి సిపిఐ అభ్యర్థులను గెలిపించాలి**
**- జోరుగా కమ్యూనిస్టు పార్టీ, తెలుగుదేశం నాయకుల ప్రచారం**







**ప్రజాపక్షం/పాల్వంచ :** గత 27 ఏండ్లుగా ఎన్నికల మోహం ఎరుగని పాల్వంచ పట్టణ ప్రజలకు ఎన్నికలు తీసుకొచ్చిన ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. ఆయన కలుపుగోలుతనం, నీతి, నిజాయితీ, నిరాడంబరతలు కలబోసిన కూనంనేనిపై పట్టణ వ్యాప్తంగా ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి. దీనితో పాల్వంచ మరింత అభివృద్ధి జరగటానికి ఆస్కారం ఉందని అంటున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ పాల్వంచ డివిజన్ పరిధి 27 డివిజన్ లలో పోటీ చేస్తున్న సిపిఐ, తెలుగుదేశం పార్టీలను గెలిపించటానికి ప్రజానీకం సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. అక్రమార్కులు, భూకబ్జాదారులకు ఓట్లేస్తే అభివృద్ధి నిలిచిపోతుందని, ప్రభుత్వ, అసైండ్, అటవీ భూములకు రక్షణ లేకుండా పోతుందని పలువురు బహిరంగంగా చర్చించుకోవటం విశేషం. ముఖ్యంగా అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆపార్టీలోకి జంపయ్యేజంపింగ్ జిలానీల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నది. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కష్టపడ్డ కార్యకర్తలను కాదని ఆర్థిక పలుకుబడి కలిగిన వారికి సీట్లివ్వటంతో పాత కాంగ్రెస్ శ్రేణులు మండిపోతున్నారు. అదనుచూసి దెబ్బకొట్టడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం.

**- పలు డివిజన్‌లలో హోరెత్తుతున్న ప్రచారం...**
పాల్వంచ రెండవ డివిజన్‌లో పగిడిపల్లి ఆదిలక్ష్మి, మూడవ డివిజన్ నుండి గుగులోత్ కల్పనలకు ప్రశాంత్‌నగర్ కాలనీ, వెంగళరావు కాలనీలలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. నాలుగవ డివిజన్‌లో రావుల స్వాతి తమ ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగిస్తున్నారు. 6వ, డివిజన్ నుండి బరిలో నిలుచున్న సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్‌కు మద్దతుగా ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందిరానగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. 40వ, డివిజన్ నుండి మరోసారి పోటీ చేయుచున్న పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబ పట్ల ప్రజలు, వ్యాపార వర్గాలు సానుకూల ధృక్పథాన్ని ప్రదర్శిస్తున్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేసిన ఆయన పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దీనితో ఆయన గెలుపు ఖాయమంటూ ప్రచారం సాగుతున్నది. 35వ, డివిజన్ నుండి నామా కీర్తి ప్రత్యర్థుల ఎత్తులు చిత్తు చేస్తూ తెలుగుదేశం, సిపిఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం సాగిస్తున్నారు. 37 డివిజన్ నుండి పోటీ చేస్తున్న డాక్టర్ కమల తమ ప్రచారంలో చాపకింద నీరులా దూకుపోతున్నారు. ప్రముఖ వైద్యులు టివి రామ్ సేవలను గుర్తుకు చేసుకొంటున్నారు. ఆయనకు గుర్తుగా కమలను గెలిపించాలని ఓటర్లు ఓ నిశ్చయానికి వచ్చారంటూ తెలుస్తోంది. పాత పాల్వంచ ఏరియాలోని 46, 47 డివిజన్‌లలో గుర్రం వెంటేశ్వర్లు, మహమ్మద్ జిలానీబేగంల ప్రచారం దూసుకుపోతున్నారు. ప్రత్యర్థి పార్టీల అంచనాలకు ఎంతమాత్రం అంతు చిక్కకుండా ప్రజా మద్దతుల లభిస్తున్నది. వీరి గెలుపులో ఏమాత్రం సందేహం లేదని మెజారిటీపై చర్చలు సాగుతున్నాయి. 45వ, డివిజన్‌లో విద్యావేత్త గౌతమి క్రిష్ణ గొల్లగూడెం, ఒడ్డుగూడెం తదితర కాలనీలలో ప్రచారంలో ముందంజలో ఉన్నారు. సమస్యలపై సమగ్ర అవగాహన కలిగిన క్రిష్ణను గెలిపించాలని తద్వారా జవాబుదారి తనంతో కూడిన అభివృద్ధి పనులు జరుగుతాయని ప్రజల్లో నమ్మకం ఉంది. 39వ, వార్డు నుండి పోటీలో నిలుచున్న మహమ్మద్ అస్లాం ప్రత్యర్థులకు గట్టి సవాల్ విసురుతున్నారు. 38 డివిజన్ నుండి చెరుకూరి శేఖర్ బాబు తమదైన శైలిలో దూసుకుపోతూ ప్రజల్లో కలిసిపోయి కంకీ కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు. పట్టణ ప్రజలకు సుపరిచితులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు 44 డివిజన్‌లో గెలుపు దిశగా దూసుకుపోతున్నారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న నామా కీర్తి

**- 35వ, డివిజన్‌లో విస్తృత ప్రచారం**
**- పనిచేసే పార్టీలకే పట్టం కట్టాలి**
**- కంకీ కొడవలి గుర్తుపై ఓటేసి సిపిఐని గెలిపించాలి**
**- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం**



**ప్రజాపక్షం/పాల్వంచ :** నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే పార్టీలను ఎన్నికలలో గెలిపించి పట్టం కట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కోరారు. 35వ, డివిజన్ నుండి పోటీ చేస్తున్న తెలుగుదేశం, సిపిఐ మిత్రపక్షాల అభ్యర్థి నామా కీర్తి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం జోరుగా ప్రచారం నిర్వహించారు. మొదటగా సీతారామపట్నం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. సీతారామపట్నం, రామాలయం మీదుగా ప్రియదర్శిని కాలని,జ్యోతినగర్ వరకు సాగింది. ర్యాలీకి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. సీతారామపట్నం శాఖ కార్యదర్శి తంతెనపల్లి వెంకన్నగౌడ్, తెలుగుదేశం నాయకులు మేదరమెట్ల నారాయణలు ముందున్నారు. ఈ సంధర్భంగా ఇంటింటికి వెళ్ళి ఓట్లను అభ్యర్థించారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్నటువంటి పలు సమస్యల పరిష్కారానికి పాటుపడతానని అభ్యర్థి నామా కీర్తి అన్నారు. కంకీకొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేని విధంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకొంటానని అన్నారు.

**- సిపిఐ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలి :**
అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ ... గత పాలకులు తమ స్వార్థంతో పాల్వంచకు ఎన్నికలు తీసుకురాలేదని ఆరోపించారు. దీనితో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. దీనికి పరిష్కారం చూపుతూ ఎంఎల్ఏ కూనంనేని పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చారని చెప్పారు. ఆయనకు మద్దతుగా ఓటర్లు సిపిఐ, తెలుగుదేశం మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విద్యావంతురాలు, సమస్యలను పసిగట్టి పరిష్కారం కోసం పాటుపడే నామా కీర్తిని గెలిపించి డివిజన్ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కోరారు. ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు సహకారంతో సమస్యలను పరిష్కరించే విధంగా పాటుపడతామని స్పష్టం చేశారు. పాల్వంచ పట్టణానికి ఇప్పటికే కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని, కార్పోరేషన్ స్థాయికి తగ్గట్టుగా పరిశ్రమల స్థాపనకు ఎంఎల్ఏ కూనంనేని తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యున్నత విశ్వ విద్యాలయం ఎర్త్ యూనివర్శిటి, మరో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ కేంద్రం, కోట్ల నిధులతో బైపాస్ రహదారులు తీసుకొచ్చారని తెలిపారు. అవినీతికి తావులేని, నీతివంతమైన పాలన అందిస్తున్న కూనంనేని సాంబశివరావుని బలపరుస్తూ కంకీకొడవలి గుర్తుపై ఓట్లేసి నామా కీర్తిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వైఎస్.గిరి, టిడిపి సీనియర్ నాయకులు చావా సత్యనారాయణ, నాయకులు, నిమ్మగడ్డ రమణ, కేవి. రావు, మండెపుడి హనుమంతరావు, చేకూరి నాగేశ్వరరావు, కార్యకర్తలు కల్లోజి సుమంత్, సాయిగౌడ్, పవన్, అల్లి శశికుమార్, నామా ప్రసాద్, గుర్రం వెంటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్




**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఆర్డిఓ కార్యా లయం ప్రాంగణంలో ఉన్న ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు భద్రతకు సంబందించి ప్రతీ నెల తనిఖీ చేయడం జరుగుతుందని చెప్పారు. సిసి కెమేరాల పనితీరును పరిశీలించినట్లు చెప్పారు. గోదాము పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అనుమతి లేనిదే ఎవ్వరినీ లోనికి రానివ్వొద్దని సెక్యూరిటీ గార్డుకు తెలిపారు.అనంతరం తనిఖీ రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ తనిఖీల వెంట ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల స్బిబంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 15 కేజీల గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/భద్రాచలం :** అక్రమంగా తరలించుకుపోతున్న 15.07 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. వివరాల ప్రకారం స్థానిక ఆర్‌టిఏ చెక్‌పోస్టు సమీపంలో సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా టిజి 08 హెచ్‌క్యు 9088 నెంబరు గల కారు వేగంగా వస్తోంది. కారును ఆపి సోదాలు చేయగా అందులో 15.07 కేజీల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ గంజాయిని ఒడిస్సా నుండి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు నిందితులు విచారణలో వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా జీడిమెట్లకు చెందిన రఘు విష్ణోవి, శేఖర్ రామ్ అనే నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి కారు, రెండు సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

## యువత వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** నిరుద్యోగులైన గిరిజన యువత వృత్తి నైపుణ్యాలు పెంచుకుని జీవితాల్లో స్థిరపడాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఐటిడిఏ ప్రాంగణంలోని వైటిసిలో శిక్షణ పొందుతున్న యువత ఐటిడిఏలోని అన్ని విభాగాల్లో తిరిగి సేకరించిన పలు వివరాలు, శిక్షణకు చెందిన వివరాలు ఛాంబర్లో పిఓకు వివరించారు. యువత ప్రభుత్వం ఉద్యోగం వచ్చేంత వరకు వృత్తి నేపుణ్యంతో కుటుంబాలను పోషించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు పాల్గొన్నారు.

## మాన్‌సింగ్‌కు కాంగ్రెస్ నాయకుల నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** వెంకట్యాతండా గ్రామ పంచాయితీ నందు బల్లునగర్ తండాకు చెందిన భానోత్ మాన్‌సింగ్ అనారోగ్యంలో మృతి చెందారు. కాగా వారి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ఆత్మశాంతి చేకూర్చాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు వాంకుడోత్ గోపాల్, మాజీ సర్పంచ్ కృష్ణ, ఉప సర్పంచ్ రమేష్, బానోత్ మంగ్య, టీడీ జమ్లా నాయక్, నారాయణ, వెంకట్రాం, గుగులోత్ శ్రీను, గుగులోత్ శోభన్, వాంకుడోత్ కృష్ణ, ఆంగోత్ నందియా పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేకం

**ప్రజాపక్షం/కారేపల్లి:** కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేకమని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఖమ్మం జిల్లా నాయకులు భూక్య శివా నాయక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తీసి పోకుండా బిజెపి ప్రభుత్వం తమ పుష్కార కాలంతో పేద ప్రజలకు వ్యతిరేకంగా సంపన్న వర్గాలకు స్వదేశీ విదేశీ అనుకూలమైన బడ్జెట్లను రూపొందిస్తుందని, దీన్ని ఫలితంగా పేదలు మరి అంత పేదలుగా సంపన్నులు మరి అంత సంపన్నులుగా పెరుగుతున్నట్లు భారత ఆర్థిక గణాంకాలు రుజువు చేస్తున్నాయన్నారు. . క్రమంగా పథకాన్ని నీరు కార్చడానికి భూమికను తయారు చేసిందని, కనుక ఈ బడ్జెట్ను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, రాజకీయ సంస్థలు ముక్త కంఠముతో ఖండించాలనని డిమాండ్ చేశారు.

## సత్యనారాయణపురంలో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో నవశకం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గట్లగౌరవరం పంచాయతీ సర్పంచ్ బండ్ల రాణి ఆత్మప్రసాద్ ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో పలువురు రోగులకు పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈకార్యక్రమంలో నవశకం వ్యవసాపక అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల రమేష్, గ్రామీణ వైద్యులు బూసుపల్లి శశిభూషణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పిట్ల శివయ్య, పినపాక కృష్ణారావు, పిట్టల రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు కూటమి గాలి వీస్తోంది

- ప్రజా శ్రేయస్సే మా ధ్యేయం
- సీట్ల పంపిణీలో సమన్యాయం పాటించాం
- జనరల్ స్థానాల్లో కూడా ఎస్సీలను నిలిపాం
- సిపిఐ కూటమి అభ్యర్థులను గెలిపించండి
- విలేకరుల సమావేశంలో కూనంనేని








**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ప్రస్తుత కార్పోరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు కూటమి గాలి వీస్తోందని, 60 డివిజన్ల వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని, ఎక్కడ చూసినా ఎరుపు, పసువు, నీలి జెండాల రెపరెపలు కనివిందు చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో గురువారం దళిత సంఘాల ఐఖ్య సంఘటిత వేదికతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా శ్రేయస్సే తమకు ధ్యేయమని, తమకు పదవులు, అధికారం ముఖ్యం కాదన్నారు. కార్పోరేషన్ సాధించుకోవడం ద్వారా తన చిరకాల స్వప్నం సాకరమైందని, తద్వార పాల్వంచ నుండి సుజాతనగర్ వరకు అనూహ్యమైన అభివృద్ధి జరగనుందని, పరిశ్రమలు రానున్నాయని, ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల జీవనవిధానం మెరుగు పడుతుందని చెప్పారు. ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు వచ్చాయని, వాటితో కార్పోరేషన్ వ్యాప్తంగా అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో సీట్ల సర్ధుపాటు విషయంలో సమన్యాయం పాటించామని, జనరల్ స్థానాల్లో సైతం ఎస్‌సిలను నిలిపామని, బిసి, మైనార్టీలకు సముచిత గౌరవం దక్కిందన్నారు. ఇది అందరి ఎర్రజెండా అని, ఈ ఎర్రజెండాను గెలిపించుకోవడం ద్వారా ఆభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. సిపిఐ,టిడిపి,దళిత సంఘాల ఐఖ్య సంఘటి వేదిక కలిసి కష్టపడి పనిచేసి తమ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్‌కు మనకు ఎలాంటి వైరం లేదని, సీట్ల సర్ధుబాటు విషయంలో సంఖ్యా పరమైన సమస్య తలెత్తడంతో సిపిఐ కూటమి 60 సీట్లలో పోటీకి వెళ్లిందన్నారు. విధాన పరమైన విధానాల వల్లే విడివిడిగా పోటీ చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా కలిసే ఉన్నామని స్పష్టం చేశారు. తాము అధికారం కోసం కక్కుర్తి పడే వారమైతే ఎప్పుడో మంత్రులమయ్యే వారమని, ఎర్రజెండా నేతలు ప్రధాని పదవిని సైతం ప్రజల కోసం ప్రక్కకు పెట్టారని చెప్పారు. ప్రభుత్వం మాదే, ఎంఎల్‌ఏది ఏముందిలే అంటూ కొందరు అంటున్నారని, మరి ఎంఎల్‌ఏ బాధ్యలు ఎంటో తెలియదా అని అన్నారు. కమ్యూనిస్టులది ఏముందిలే అనడటం అవివేకం అని, ప్రజా స్వామ్య ప్రభుత్వంలో ఎవరి పనులు వారివే అని గుర్తు చేశారు. 12వ వార్డు అభ్యర్ధిని నాగలక్ష్మి,13వ వార్డు అభ్యర్ధిని పి.ఇందిరా ప్రియదర్శిని, 15వ వార్డు అభ్యర్ధిని కె సాహితి ఎన్నికల గుర్తు కంకి కొడవలికి ప్రజలు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కూసపాటి శ్రీనివాస్, బొమ్మెర శ్రీనివాస్, రత్నకుమారి, మేదిని లక్ష్మి, బొంకూరి పరమేష్, ఇటికల మొగిలి, దాసరి సారధి, ఎర్ర కామేష్, మాతంగి సంతోష్, పీక కృష్ణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడా సంజీవరెడ్డిని ఆశీర్వదించండి

- పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సీపీఎం పార్టీ బలపరిచిన బిఆర్‌ఎస్ అభ్యర్థి గూడా సంజీవరెడ్డిని, ఆశీర్వదించాలని పాలేరుమాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఓటర్లను కోరారు. గురువారం ఏదులాపురంము న్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 22వ డివిజన్లో విజయాన్ని కాంక్షిస్తూ ముమ్మర ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పువాయి ద్యాలు, కోలాటాలతో ఉత్సహభరితంగా సాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంలో మాటల గారడీ తప్ప ప్రజలకు చేసిందేమి లేదన్నారు. అమలు కానీ హామీలను గుప్పించి అధికారం లోకి వచ్చి ప్రజలను నయవంచన గురి చేస్తున్నట్లు ఆరోపించారు. ఆరు గ్యారెంటీలంటూ ఎన్నికలలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అటకెక్కించారన్నారు. కానీ బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో సీఎం కేసిఆర్ దక్షతతో అభివృద్ధి జోడెద్దుల గుర్రంలా పరుగెట్టింద న్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసానికి, బిఆర్‌ఎస్ చేసిన సంక్షేమమే రిఫ రండంగా నిలిచిందన్న విషయాన్ని గుర్తు చేశారు. మోసానికి, అభివృ ద్ధికి జరగుతున్న పోరాటంలో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బిఆర్‌ఎస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కావున కారు గుర్తుపై ఓటేసీ సంజీవరెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, మాజీ జెడ్పి టీసి యండపల్లి వర ప్రసాద్, మున్సిపాలిటీ బిఆర్‌ఎస్, సీపీఎం నాయ కులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్‌కు ఓటు అడిగే నైతికహక్కు లేదు..

ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాల్ ఎన్నికల్లో కాంగ్రేస్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గౌడ్ మాజీ జిలా లపార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగా రావుతో కలిసి 5వ వార్డు ఔన్సిలర్ అభ్యర్థి మిట్టపల్లి రాఘవరావు, 6వ వార్డు కాంగ్రేస్ అభ్యర్థి డాక్టర్ కాపా చంద్రకళ, 12వ వార్డు కాంగ్రేస్ పార్టీ అభ్యర్థి మిట్టపల్లి కృష్ణవేణి విజయాన్ని కాంక్షిస్తూ వార్డుల్లో ఇంటింటికి విస్తృతంగా ప్రచా రం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కాంగ్రేస పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ అధికారం లో ఉన్న పదేళ్లపాటు ప్రజా సమస్యలను విస్మరించి ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ముఖ్యమంత్రి కెసిఆర్ అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ళు, మహిళలకు ఉచి త బస్సు ప్రయాణం, డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తూ ఆర్థిక భారం ఎక్కువైనా కాని ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ వస్తుందని, ఇలాంటి ప్రజా ప్రభుత్వంపై కొందరు అవాక్కులు, చెవాక్కులు పేలుతున్నారని కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం వందల కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చి వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడుతున్న పార్టీ కాంగ్రేస్ పార్టీ అని, రూ.200కోట్ల ఖర్చుతో గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తీసుకొచ్చిన ఘనత కాంగ్రేస్ పార్టీది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సీతారాములు, మండల పార్టీ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు గరిడేపల్లి కిషక్షర్, పమ్మి అశోక్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, వీరంశెట్టి సీతారాములు, కట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కుష్ఠువ్యాధిపై అవగాహన







**ప్రజాపక్షం/ మధిర :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు మధిర మండల పిహెచ్‌సి నందు గురువారం కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం స్థానిక సిపిఎస్ హైస్కూల్ నందు ఇన్‌చార్జి హెచ్‌ఎం రవి అధ్యక్షతన విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎవరి శరీరంపైన నొప్పిలేని స్పర్శలేని దురదలేని రాగి రంగు కలిగిన మొద్దు బారిన మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి మచ్చలుగా అనుమానించి ముందుగా గుర్తించి కుష్టు వ్యాధిగా వైద్యులు నిర్ణయిస్తే విలువైన మందులు, మల్టి డ్రగ్ థెరపీ (ఎండిటి) ద్వారా పారా మెడికల్ సిబ్బంది ద్వారా ఉచిత చికిత్స అందిస్తారని పలు విషయాలను వివరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వినోద్, పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఇఓ గోవింద్, సూపర్‌వైజర్ సరోజని, లంకా కొండయ్య, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె నోటీస్ అందజేత



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక పారిశ్రామిక విధానాల వల్ల ప్రజలు కార్మికులు కార్మిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించిన జాతీయ కార్మిక సంఘాల స్వతంత్ర ఫెడరేషన్లు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో భాగంగా సిఐటియు యూనియన్ అనుబంధ కార్మికుల సమ్మె నోటీస్‌ను తల్లాడ గ్రామపంచాయతీ ఈఓకి గురువారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షేక్.చాంద్‌పాషా, సురేందర్‌రెడ్డి, వేలాద్రి, శ్రీకాంత్, శంకర్, రామకృష్ణ, ప్రసన్నకుమార్, సుజాత, ధనమ్మ, శిరీష,, సునీత, జ్యోతిలక్ష్మి , బాబురావు, దారెల్లి బాబురావు, మహంకాళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కట్ల సంతోష్‌ను గెలిపించండి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో కాంగ్రేస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కట్ల సంతోష్‌ను గెలిపించండి అభివృద్ధికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. గురువారం కట్ల సంతోష్ వార్డులో జోరుగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లిన సంతోష్ ఓటర్లను చేతి గుర్తుకు ఓటు వేయాలని గెలిపించాలని కోరారు. ఈ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కూడా వార్డులో పర్యటించారు. సంతోష్ గెలుపుతో వార్డు మరింత అభివృద్ధిలో ముందుకు పోతుందని వార్డు సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తానని మీరందరూ సంతోస్‌ను దీవించి చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రేస్ నాయకులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ పండ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** వివిధ కారణాల వల్ల ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ సిఎం రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సహాయం చేయటం జరుగుతుందని మీనవోలు గ్రామ సర్పంచ్ కోట కన్నమ్మ, ఉపసర్పంచ్ ముక్కర సందీప్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మీనవోలు గ్రామంలో డిప్యూటీ సిఎం మల్లుభట్టివిక్రమార్క సిఫార్సుతో మీనవోలు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.1,89,000 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోటా రాంబాబు, ఎఎంసి డైరెక్టర్ వేమిరెడ్డి అనురాధ, వార్డు మెంబర్లు ఆకుల సాంబశివరావు, కుడుముల వెంకట్రావమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, బలుసు త్రివేణి, యన్నం విజయలక్ష్మి , చీలి భాగ్యరాజు, షేక్.బాజి, నంద్రు బాబురావు, ముక్కర సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిన మాజీ ఎమ్మెల్యే చంద్రావతి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మాజీ శాసన సభ్యురాలు బానోతు చంద్రావతి గురువారం వైరాలో జరిగిన బిఆర్‌ఎస్, సిపిఎం, సిపిఐ కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డుల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు, జిల్లా బిఆర్‌ఎస్ అధ్యక్షులు తాతా మధు, సిపిఎం వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రం వార్డుల్లో ప్రచార కార్యక్రమంలో భాగంగా శాంతినగర్ 20వ వార్డులో ప్రారంభంలో కార్యకర్తలతో కలిసి డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేసి పార్టీ శ్రేణులను బానోతు చంద్రావతి పార్టీ సభ్యులను ఉత్సాహపరించారు. చంద్రావతి మండల బిఆర్‌ఎస్ అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు, మాజీ సుడా చైర్మన్ బచ్చు వజియ్‌తో కలిసి డాన్స్ చేయడం బిఆర్‌ఎస్ శ్రేణులను ఆకట్టుకుంది.

# సిపిఐ అభ్యర్థుల గెలుపుకోసం పాటుపడాలి

**- ఎంఎల్ఏ కూనంనేని**

**-సిపిఐలో 50 కుటుంబాలు చేరిక**



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో బుధవారం ప్రకాష్ నగర్‌కు చెందిన 50 కుటుంబాల వారు చేరారు. పల్లపు సాగర్, పల్లపు విజయ్ కుమార్, బోదాసు రామ్ ప్రసాద్, ఆధ్వర్యంలో చేరిన వారికి ఎంఎల్ఏ కూనంనేని ఎర్రకుండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో చేరిన వారు ప్రజా సంక్షేమం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని, వందేళ్ల పాటు ప్రజల కోసం పోరాటాలు చేస్తుంది కమ్యూనిస్టులే అన్నారు. జరగనున్న కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని చెప్పారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎంఎల్ఏ కూనంనేని చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై సిపిఐలో చేరినట్లు తెలిపారు. ఆయన సారధ్యంలో ముందుకు సాగుతామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పని చేస్తామన్నారు. కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మండలాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

**కలెక్టర్ జితేష్ వి పాటిల్**






**ప్రజాపక్షం/గుండాల :** మండాలాబి వృద్దిలో ప్రజలు ప్రజాప్రథినిదులు భాగస్వామ్యం కావాలని అప్పుడే మండలం పూర్తి స్తాయిలో అభివృద్ధి దిశగా నడుస్తోందని జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అన్నారు. యాస్పిరేషన్ బ్లాక్‌లో బాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రినందు సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంబింపచేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ గ్రామాల్లో విధిగా హెల్త్ క్యాంపులను నిర్వహించి వ్యాదినిర్ధారన కొరకు రక్త నమూనాలను తీసుకొని క్షయ నివారణ కొరకు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచులు విధిగా అంగన్‌వాడి కేంద్రాలను, పాఠశాలలను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించాలని , అంగన్‌వాడి కేంద్రాలలో పిల్లలకు అందించే పౌష్టి కాహారం సక్రమంగా అందుతుందా లేదా అని చూడాలని అన్నారు. అలాగే గ్రామాల్లో పశువులకు రోగనిరోదక టీకాలను వేయాలని పశువైద్యాదికారులకు సూచించారు. వరి, మొక్కజొన్న పంటలతో పాటు అధిక లాబాలను అందించే మునగా, ఆకుకూరలను సాగుచేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. చదువుకొని ఉపాదిలేక ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతకు వేతనంతో కూడిన ఉచిత శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని మండలంలోని నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసి స్టాల్స్‌ను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఇఒ నాగలక్ష్మి , డిఎంఅండ్‌హెచ్‌ఒ తుకారం, సిపిఒ సంజీవరావు, జిల్లా సంక్షేమాదికారి స్వర్ణకుమారిలేనీన, జిల్లా పశువైద్యాదికారి వెంకటేశ్వరావు, సిడిపిఒ మంగతాయారు, తహసీల్దారు ఖాసీం, ఎంపిడిఒ బాలరాజు, వైద్యాదికారి మనీష్‌రెడ్డి, సుదీప్, సర్పంచులు, అంన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా రహదారి భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెల్లో 49 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 17 మంది మృతి చెందారని, ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను గుర్తించి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ నెల సమావేశాలు నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్నారు. ములుపు రోడ్ల వద్ద హెచ్చరిక బోర్డులు, రోడ్ల మరమ్మత్తులు, సామాగ్రి, కావాల్సిన ఇతర వస్తువులకై వెంటనే సమగ్ర నివేదికలను సంబంధిత అధికారులు ఇవ్వాలన్నారు. అనంతరం ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ మద్య సేవించి వాహనాలు నడపటం వల్ల కలిగే నష్టాలు, రహదారి భద్రతా అంశాలను పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు పెట్టి చెప్పాలని, హెల్మెట్ వినియోగంపై విస్తృ ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బయోప్లాక్ విధానంలో చేపల సాగు

**-విజయవంతంగా ముగిసిన 3 రోజుల శిక్షణ**






**ప్రజాపక్షం/కూసుమంచి:** మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో భారతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో తెలంగాణ మత్స్యకారులకు, మత్స్య రైతులకు జరుగుతున్న బయోప్లాక్ విధానంలో చేపల సాగు అను అంశంపై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం 3వ రోజు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట జిల్లాల నుండి 25 మంది మత్స్య రైతులు, మత్స్యకారులు హాజరైన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం జిల్లా డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజన్, నాబార్డ్ ఎల్ సుజిత్ కుమార్ మత్స్య రైతులు తప్పకుండా మత్స్య పరిశోధన స్థానం పాలేరు, మత్స్య శాస్త్రవేత్తలు బయోప్లాక్ టెక్నాలజీలో నేర్పిన మెలకువలను తప్పకుండా పాటించాలని కోరారు. అలాగే నాబార్డ్ వారు అందిస్తున్న పథకాలను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా మత్స్య రైతులు తరచుగా చేసే తమ తపోప్పులను సరిదిద్దుకుంటూ తమ జీవితాలలో ఈ మత్స్యరంగము సహాయముతో మరింత ముందుకు సాగాలని కోరారు. ఈకార్యక్రమంలో సీనియర్ మత్స్య శాస్త్రవేత్త, అధిపతి మత్స్య పరిశోధన స్థానం పాలేరు డాక్టర్ ఎం శ్యాం ప్రసాద్, యంగ్ ప్రొఫెసనల్‌లు మత్స్య పరిశోధన స్థానం పాలేరు సిగ నాగరాజు, డాక్టర్ కే అరుణ్, బానోత్ దివ్య, డాక్టర్ కె అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామంలో విద్యుత్ షాక్ తో చందా ప్రసాద్ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వరి పొలానికి నీళ్లు మోటర్ ద్వారా సరఫరా చేస్తుండగా చందా ప్రసాద్ (35) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లో కెళితే.. ఉదయం 6 గంటలకి పొలానికి నీరు పెడదామని వెళ్లారు, 10 గంటల సమయంలో వాళ్ళ అన్నకి ఫోన్ చేసి అన్నం పట్టారా అని చెప్పారు. 11 గంటలకు పొలం దగ్గరికి వచ్చి శ్యామ్ చూడగా ఎక్కడ చూసినా కనబడడం లేదు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది ఏమైందని చూడగా మోటార్ దగ్గర కింద పడి ఉండడంతో వెంటనే చుట్టుపక్కల వాళ్లకు ఫోన్ చేసి చెప్పారు వెంటనే అందరూ హడావుడిగా వచ్చి అతన్ని బయటికి తీసుకొచ్చారు. విద్యుత్ శాఖ ఏడి జీవన్ రాజ్, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ ఘటనతో మండలంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు ఎస్సై పివీ నాగేశ్వరరావు ఘటనపై విచారణ చేపట్టారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# వంగర సమ్మక మృతి

**సంతాపం తెలిపిన సిపిఐ జిల్లా నాయకులు**



**ప్రజాపక్షం/కరకగూడెం:** సిపిఐ మణుగూరు, పినపాక మండల నాయకులు సీపీఐ కరకగూడెం మండల కార్యదర్శి వంగర సతీష్ తల్లి వంగర సమ్మక (70) గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, పినపాక మాజీ మండల కార్యదర్శి లు జిల్లా సమితి సభ్యులు పత్తిపాటి నాగేశ్వరరావు, గడ్డం మనోహర చారి లు హాజరై ఎర్రజెండా కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# సత్తా చాటిన సత్తుపల్లి శ్రీ చైతన్య కరికులం విద్యార్థులు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి విద్యాలయం శ్రీ చైతన్య కరికులం విద్యార్థులు జాతీయస్థాయి నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ ఒలింపియాడ్‌లో అద్భుత విజయాలు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని ప్రిన్స్ పాల్ నాగరాజు తెలిపారు. విద్యార్థుల మేధస్సు, ఆలోచనా శక్తి, విశ్లేషణాత్మక నైపుణ్యాలను గుర్తించే ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు, పథకాలు సాధించి పాఠశాల ఖ్యాతిని మరింత పెంచారన్నారు.గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి. గోపాల్ రావు, అడ్వకేట్ లక్ష్మీ నారాయణ విజేతలను అభినందిస్తూ తమ చేతుల మీదుగా నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల విజయాల్లో పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, డీన్, సీఈ ఇంచార్జ్, ఒలింపియాడ్ ఇంచార్జ్‌తో పాటు ఉపాధ్యాయుల ప్రోత్సాహం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విజయాలపై ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# అయ్యప్ప స్వామి ప్రసాదం మహాప్రసాదం



**ప్రజాపక్షం/మణుగూరు:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన హరిహరసుతుడు అయ్యప్పస్వామి వారి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం పర్వదినం సందర్భంగా గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రతి నెల వివిధ పీఠాల్లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో గల శ్రీ వైకుంఠ సీతారామచంద్రస్వామి వారి దేవాలయం ఆవరణలో అయ్యప్ప స్వామి పీఠం ఎదురుగా మండలంలోని పీఠం గురుస్వాముల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా అశ్వాపురం మండలంలోని అరిఫా అండ్ రోష్ని వృథాశ్రమంలో కూడా అయ్యప్పస్వామి పీఠం గురుస్వాముల ఆధ్వర్యంలో 30 మంది వృద్ధులకు రుచికరమైన వంటకాలతో అన్నదానం చేశారు.అన్నదాన కార్యక్రమాల్లో ముందుగా అర్చకులు గణపతి మంత్రోచ్చరణతో అయ్యప్ప స్వామి వారి విగ్రహానికి ప్రతిష్టించి పుష్పాలతో అభిషేకం చేసి పూల మాలలు వేసి కన్నుల పండువగా అలంకార ప్రియుడిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి వారి మహా ప్రసాదం స్వీకరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేశారు.

# నిరసన తెలిపిన న్యాయవాదులు



**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో న్యాయవాదిని హత్య చేయడం పట్ల ఖమ్మంలో న్యాయవాదులు గురువారం నిరసన తెలిపారు. యువ మహిళా న్యాయవాది స్వప్నను భూ వివాదంలో దారుణంగా హత్య చేయడం శోచనీయమని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ ఐలు, వివిధ న్యాయవాద సంఘాలు పాల్గొన్నాయి.

# ఊట్ల కొండలరావును గెలిపించండి

## -ఏడవ డివిజన్‌లో సిపిఐ ఇంటింటి ప్రచారం





**ప్రజాపక్షం/ ఖమ్మం :** మధిర మున్సిపాలిటీ ఎన్నికల్లో ఏడవ వార్డులో సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఊట్ల కొండలరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి కోరారు. గురువారం ఇంటింటికి తిరిగి కంకి కొడవలి గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ మడుపల్లి గ్రామం కమ్యూనిస్టు పార్టీక పెట్టని కోటగా నిలిచిందన్నారు. అనేక దశాబ్దాల పాటు కమ్యూనిస్టు పార్టీని ఆదరించారని మరోమారు ఊట్ల కొండలరావును గెలిపించి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థికి పట్టం కట్టాలని జితేందర్‌రెడ్డి కోరారు. బిఆర్‌ఎస్, సిపిఎం బలపరుస్తున్న ఊట్ల కొండలరావు గెలుపుతో మడుపల్లి అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, ఏనుగు గాంధీ, పావులూరి మల్లికార్జున్, నాయకులు దూసరి గోపాలరావు, ఊట్ల కామేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### మడుపల్లిలో మిత్రపక్షాల భారీ ర్యాలీ...

బిఆర్‌ఎస్, సిపిఐ, సిపిఎం అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మడుపల్లిలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఎం నాయకులు పోతినేని సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు. మడుపల్లిలో మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని నేతలు విజ్ఞప్తి చేశారు. మిత్రపక్షాల ర్యాలీకి ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల్లో మిత్రపక్షాల అభ్యర్థులకే పట్టం కట్టాలని నామ నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

### వైరా 15వ వార్డులో ఇంటింటి ప్రచారం...

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో బిఆర్‌ఎస్, సిపిఎం, టిడిపి లు బలపర్చిన సిపిఐ అభ్యర్థి నల్లమోతు శైలజ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కంకి కొడవలి గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రపక్షాల నాయకులు యర్రాబాబు, దొండపాటి రమేష్, మునిగ కోటేశ్వరరావు, మెంటెం రామారావు, కొత్తా సీతారామయ్య, కొత్తా నాగేశ్వరరావు, మాచర్ల నాగభూషణం, కొత్తా వెంకటేశ్వరరావు, అమర్లపూడి గాంధీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే వైరా మున్సిపాలిటీ అభివృద్ధి

## ఎన్నికల ప్రచారంలో పువ్వాడ, నామ





**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధి కెసిఆర్ పుణ్యమని, సిఎం కళ్లలో కెసిఆర్ రూపమేనని, 25 నెలల్లో కాంగ్రెస్ ఈ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి శూన్యమైనవి మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. వైరా మున్సిపాల్ ఎన్నికలు భాగంగా గురువారం మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు, టిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సిపిఎం వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రంతో కలిసి 20,3,7,9 వార్డుల్లో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత 20వ వార్డు శాంతినగర్ తండాలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. 20,3,7,9 వార్డుల్లో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక మున్సిపాల్ ఎన్నికల బిఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరు లసమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి బాకీ కార్డు చేరాలని, అదేవిధంగా మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై ప్రతిఒక్కరూ ప్రశ్నించాలని కోరారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి టిఆర్‌ఎస్ పార్టీ కెసిఆర్ నిధులు కేటాయించారని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి చెందకుండా అడ్డుకున్న నాయకులు అవినీతి పాలనగా మార్చిన నాయకులు మీరు కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలు కాలేదని ఒక్క ఆర్‌టిసి బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, ఓటుకు ఓటుకు మధ్య ఇచ్చే సంక్షేమ పథకాలు సైతం పూర్తిగా మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం అని, ఈ ప్రభుత్వానికి సరైన బుద్ది చెప్పేందుకే ఈ మున్సిపాల్ ఎన్నికలు వేదికని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్‌నావు మాట్లాడుతూ తెలంగాణ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగజారుస్తున్నాడని, బూతు పురాణంతో మతిస్థిమించిన వ్యక్తి లాగా మాట్లాడుతున్న వ్యక్తి సిఎం రేవంత్‌రెడ్డి అని అన్నారు. ఇలాంటి వారికి బుద్ధి చెప్పాలంటే వైరా మున్సిపాలిటీని గెలిపించాలని వైరా మున్సిపాలిటీపై ఎర్ర గులాబి జెండి ఎగరవేయాలని కోలరారు. కెసిఆర్ హయాంలో తప్ప వైరా మున్సిపాలిటీ బాగుపడింది లేదని, ఇప్పుడు కూడా ప్రచారంలో ప్రతి వీధిలో మురికి గుంటలు శుభ్రం చేస్తున్నారని అన్నారు. మరల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ ఇబ్బందులు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి పార్లమెంటరీ నేత నామా నాగేశ్వరరావు, మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ బానోతు చంద్రావతి, లకావత్ గిరి బాబు, బానోతు మంజుల మదన్‌లాల్, సీనియర్ నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, అప్పం సురేష్, ఆయా వార్డు అభ్యర్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రాంతీయ స్థాయికి ఎంపికైన త్రివేణి ప్రాజెక్ట్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** త్రివేణి పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు తెలంగాణ ప్రాంతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ సుస్థిర అభివృద్ధికై విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో విప్రో ఎర్తియేన్ ప్రాంతీయ స్థాయి గుర్తింపు కార్యక్రమం హైదరాబాద్ నాంపల్లిలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో అత్యంత ఉత్సాహ భరితంగా జరిగింది. సిపిఆర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ విప్రో ఫౌండేషన్, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాల ఖమ్మం విద్యార్థులు బయో డైవర్సిటీ అనే అంశంపై చేసిన ప్రాజెక్టుకు గుర్తింపు దక్కింది. వీరు రూపొందించిన ప్రాజెక్టు ప్రాంతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు ప్రాంతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు. వీరు భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను డైరెక్టర్ వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ లు ప్రాజెక్టుకు గైడ్ టీచర్ దార్ల ప్రియాంక, విద్యార్థులు ఎ. వనీషారెడ్డి, టి. షణ్ముఖ లక్ష్మి, జి.ఆరాధ్య, పి. సుస్మిత, ఎ. కార్తీక్ లను అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి డా॥ రోహిణి, టిఎస్‌పిసిబి డా॥ డబ్ల్యూజి ప్రసన్నకుమార్, ఎస్‌సిఈఆర్‌టి మధుసూదన్‌రెడ్డి, సిపిఆర్‌ఈఈసి ప్రతినిధి కె. వెంకట రత్నం చేతుల మీదుగా మెమెంటోలు, మెరిట్ సర్టిఫికెట్‌లను అందుకున్నారు.

# అందుబాటులో ఉండే వారిని ఆదరించండి

## -19వ డివిజన్‌లో సిపిఐ విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే అభ్యర్థి సత్తి శ్రీలక్ష్మిని గెలిపించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక గోల్లగూడెం శ్రీసిటీలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సిపిఐ అభ్యర్థి శ్రీలక్ష్మి ని గెలిపించాలని హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీలక్ష్మి కుటుంబం అనేక ఏళ్లుగా ప్రజా సేవలో ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. ఎన్నికలప్పుడు వచ్చి హామీలు ఇచ్చి తర్వాత కనిపించకుండాపోయే వారిని నమ్మి మోసపోవద్దని హేమంతరావు సూచించారు. ఎన్నికల్లో సిపిఐ గెలుపు 19వ వార్డు అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన తెలిపారు. ప్రచార కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పోరేటర్ బిజి క్లెమెంట్, అభ్యర్థి సత్తి శ్రీలక్ష్మి , స్థానిక సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# ముగిసిన టిఎస్‌కెసి అసలిటికల్ శిక్షణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్థానిక ఎస్‌ఆర్‌అండ్ బిజిఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కశాలలో తెలంగాణ స్కిల్స్, నాలెడ్జ్ సెంటర్ (టిఎస్‌కెసి) శిక్షణ గురువారంతో ముగిసింది. నాలుగు రోజులుగా ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుంది. టాస్క్ ట్రైనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో 75 మంది విద్యార్థులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారని టిఎస్‌కెసి కో ఆర్డినేటర్ మాధవి తెలిపారు. ఈ శిక్షణ వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా॥ శ్రీనివాస్, మెంటర్ వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖపై చేసిన ఆరోపణలు అవాస్తవం



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం అనంతారం గ్రామంలో విద్యుత్ శాఖపై కొందరు వ్యక్తులు చేసిన తప్పుడు ఆరోపణలు, పత్రికల్లో వచ్చిన అవాస్తవ కథనాలపై, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన చీఫ్ జనరల్ మేనేజర్ (ఆడిట్) రవీంద్రనాథ్ సమగ్రంగా విచారణ నిర్వహించారు. ఈ విచారణ సందర్భంగా అనంతారం గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తమ వాఖ్యలను నమోదు చేయగా, అన్ని వాఖ్యలు విద్యుత్ శాఖకు పూర్తిగా అనుకూలంగా ఉన్నట్లు స్పష్టమైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల అనంతరం ఇరు వర్గాల మధ్య ఏర్పడిన విభేదాల నేపథ్యంలో, కొందరు వ్యక్తులు వ్యక్తిగత కక్షతో విద్యుత్ శాఖ అధికారులపై నిరాధార ఆరోపణలు చేసినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు ఎటువంటి రాజకీయ ఒత్తిడులకు లోనుకాకుండా, నిబంధనలకు లోబడి, నిజాయితీతో విధులు నిర్వహిస్తున్నారని గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా వెల్లడించారు. అనంతారం గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు తమ స్వస్థలాలకు దూరంగా ఉండి కూడా, హెడ్‌క్వార్టర్స్‌లోనే నివసిస్తూ, ఏ చిన్న విద్యుత్ సమస్య వచ్చినా తక్షణమే స్పందిస్తూ, రాత్రి పగలు తేడా లేకుండా సేవలందిస్తున్నారని గ్రామ ప్రజలు ప్రశంసించారు. ఇతర శాఖలతో పోలిస్తే, విద్యుత్ శాఖ గ్రామ ప్రజలకు అత్యుత్తమమైన, వేగవంతమైన, నమ్మకమైన సేవలు అందిస్తున్న శాఖగా గుర్తింపు పొందిందని ప్రజలు తెలిపారు. అందువల్ల గ్రామ ప్రజలందరూ రాజకీయ భేదాభిప్రాయాలను పక్కనబెట్టి, ఏకగ్రీవంగా విద్యుత్ శాఖ సేవలపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ పాయం కృష్ణవేణి, ఉపసర్పంచ్ పూజారి వెంకన్న ఆధారాలు లేని ఆరోపణలు, తప్పుడు ప్రచారాలను గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, విద్యుత్ శాఖకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ విచారణలో డీఈ కె. జీవన్ కుమార్, ఏడిఈ ఉమా మహేశ్వరరావు, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజ శేఖర్, లైన్మెన్ జి. నరసింహారావు పాల్గొని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ విచారణ ఫలితంగా విద్యుత్ శాఖపై చేసిన ఆరోపణలు పూర్తిగా తప్పుడు, అవాస్తవ నిరాధారమైనవని స్పష్టంగా తేలిందని గ్రామ ప్రజలు వెల్లడించారు. అనంతారం గ్రామ ప్రజలు విద్యుత్ శాఖపై పూర్తి విశ్వాసం కలిగి ఉన్నారని ఈ సందర్భంగా మరోసారి స్పష్టమైంది.

# సమ్మక్క, సారక్క తల్లీ.. సల్లంగ సూడమ్మా...



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం సమత్ బట్టుపల్లి గ్రామపంచాయతీ కొర్నువెల్లి గ్రామం సమ్మక్క సారక్క తల్లి జాతర ఘనంగా ఆదివాసీ సంప్ర దాయాలతో మూడు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర చివరికి అంకానికి చేరుకుంది. గురువారం రాత్రి పగిడి పెద్దరాజు సమ్మక్కలకు కళ్యాణ మహోత్సవం నిర్వహించిన ఆలయ పూజారులు శుక్ర వారం ఉదయం తల్లికి మొక్కులు చెల్లించుటకు సిద్ధం చేశారు. ఉద యం నుంచి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు మూడు రాష్ట్రాల నుంచి ఇలవే ల్పులతో వచ్చిన భక్తులు భారీగా మొక్కులు చెల్లిం చుకున్నారు. ప్రజలు, భక్తులతో ఆలయ ప్రాంగణ మంతా కిటకిటలాడుతూ దర్శనమిచ్చింది. అనంతరం భక్తులు ఆలయ సముదాయంలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద పిల్లలకు ఆట వస్తువులు, యువకులు ఈల పిట్టలు, బూరలు కొనుక్కొని వాటిని ఊదుతూ జాతరంతా కలియతిరిగారు. ఇలవేల్పుల సమ్మేళనానికి వచ్చిన భక్తులు ఇలవే ల్పులు తమ సమూహాన్ని సమ్మక్క సారలమ్మగద్దెల వద్దకు వచ్చి తమ గట్ల వేల్పుల మొక్కులను చెల్లిం చారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నీళ్ళు ఆరబోస్తూ తమ భక్తిని చాటుకున్నారు. భారీ ఎత్తున తరలివచ్చిన ఇలవేల్పులకు ఆదివాసీ గట్ల పెద్దలకు తలప తులకు ఆలయ కమిటి సభ్యులు, కమిటీ అధ్య క్షుల ఆలయ కమిటీ సభ్యులు జాతరను ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసి నందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.